

లక్ష్యం సాధించే వరకు..
లక్ష్యాన్ని నిర్దేశించుకొని.. దాన్ని సాధించే వరకు విశ్రమించొద్దని గ్రూప్–2 స్టేట్ టాపర్ హరవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. - 8లో



అల్లుళ్లే అంతమొందించారు
గ్రామంలో ఆధిపత్యం కోసం మామను అతికిరాతంగా హత్య చేయించారు సొంత అల్లుళ్లు. - 8లో

రంజాన్ వేళలు
ఇఫ్తార్ 6-34 (మంగళవారం సా॥)
సహర్ 4-54 (బుధవారం ఉ॥)

న్యూస్‌రీల్

టెన్త్ పరీక్షకు 158 మంది గైర్హాజరు

నల్లగొండ : జిల్లా వ్యాప్తంగా 105 కేంద్రాల్లో జరుగుతున్న పదో తరగతి పరీక్షలకు సోమవారం 158 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. సోమవారం జరిగిన ఆంగ్లం పరీక్షకు జిల్లా వ్యాప్తంగా మొత్తం 18,679 మంది విద్యార్థులు హాజరుకావాల్సి ఉండగా.. 18,521 మంది హాజరయ్యారు. 158 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు అధికారులు తెలిపారు.

28న రైతు సత్యాగ్రహం

నల్లగొండ టూటౌన్ : నల్లగొండలోని కలెక్టరేట్ ఎదుట ఈ నెల 28న రైతు సత్యాగ్రహం నిర్వహించనున్నట్లు బీజేపీ కిసాన్‌మోర్చా జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గడ్డం వెంకట్‌రెడ్డి, గుడుగుంట్ల సాయన్నగౌడ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఐకేపీ కేంద్రాలు ప్రారంభించడంతో పాటు దొడ్డు ధాన్యానికి రూ.500 బోనస్, రైతు భరోసా, ఎండిన పొలాలకు ఎకరాకు రూ.30 వేలు నష్టపరిహారం ఇవ్వాలని సత్యాగ్రహం చేపడుతున్నట్లు తెలిపారు.

సాగర్ ఆసుపత్రిని సందర్శించిన కాయకల్ప బృందం



కమలానెహ్రూ ఏరియా ఆసుపత్రి వద్ద కాయకల్ప బృందం

నాగార్జునసాగర్ : సాగర్ కమలానెహ్రూ ఏరియా ఆస్పత్రిని సోమవారం కాయకల్ప బృందం పరిశీలించింది. తెలంగాణ రాష్ట్రంలోని వైద్యవిధాన పరిషత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జిల్లా, ఏరియా ఆస్పత్రులను ఈ బృందం ఏటా పరిశీలిస్తుంది. ఆస్పత్రిలో రోగులకు అందుతున్న సేవలు, పరిశుభ్రత, ఆస్పత్రి నిర్వహణ, పరిసరాలు, సిబ్బంది విధి నిర్వహణను పరిశీలించి నివేదికలను ఉన్నత స్థాయి అధికారులకు అందజేస్తుంది. నివేదికల ఆధారంగా ప్రమాణాలు పాటిస్తూ వైద్యసేవలు అందిస్తున్న ఆస్పత్రులను ఎంపిక చేసి అవార్డులను అందజేస్తారు. అందులో భాగంగా కొల్లాపూర్ ఏరియా ఆస్పత్రి డాక్టర్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఒక బృందం సాగర్ ఏరియా ఆస్పత్రిని సందర్శించి పరిశీలించింది. వీరితో పాటు స్థానిక కమలానెహ్రూ ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ హరికృష్ణ, వైద్య బృందం, నర్సింగ్ సిబ్బంది తదితరులు ఉన్నారు.

నెల్వలపల్లి హెచ్‌ఎం సస్పెన్షన్

చింతపల్లి : విధుల్లో నిర్లక్ష్యం వహించిన ప్రధానోపాధ్యాయుడిని విధుల తొలగిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి భిక్షపతి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. చింతపల్లి మండల పరిధిలోని నెల్వలపల్లి ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం వేణుగోపాలు విధుల్లో నిర్లక్ష్యం వహించడంతో పాటు మహిళా ఉపాధ్యాయులను మానసిక వేధించడం, పాఠశాల నిబంధనలు పాటించకపోవడం, రికార్డులు సరిగా నిర్వహించడం లేదు. దీనిపై మండల విద్యాధికారి అంజయ్య అధికారులకు నివేదిక అందజేయడంతో ఆయనను విధుల నుంచి తొలగించారు.

క్షయ రహిత జిల్లాగా మారుద్దాం



మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ శ్రీనివాస్

నల్లగొండ టౌన్ : క్షయ రహిత జిల్లా కోసం సమష్టిగా కృషి చేద్దామని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ పుట్ల శ్రీనివాస్ పిలుపునిచ్చారు. సోమవారం ప్రపంచ క్షయ వ్యాధి నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా క్షయ నివారణ సొసైటీ ఆధ్వర్యంలో స్థానిక టీఎస్‌జీవో భవన్‌లో ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. టీబీపై ప్రజల్లో విరివిగా అవగాహన కలిగించాలన్నారు. టీబీ లక్షణాలుంటే జిల్లా కేంద్రంలోని టీబీ సెంటర్‌లో పరీక్షలు చేయించుకుని సక్రమంగా మందులను వాడితే పూర్తిగా నయమవుతుందన్నారు. అనంతరం జిల్లా క్షయ నివారణ కేంద్రం రివర్‌నిమ్స్ ఆస్పత్రి సంయుక్తంగా జిల్లాస్థాయిలో విద్యార్థులు నిర్వహించిన ముగ్గుల పోటీలో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో మెడికల్ కాలేజీ ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.వాణిశ్రీ, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ అరుణకుమారి, డాక్టర్ దామెర యాదయ్య, డాక్టర్ వేణుగోపాల్‌రెడ్డి, కేస రవి, అరుంధతి, బ్లెస్సీ, ఇస్తార్, రవిప్రసాద్, హరికృష్ణ, రమేష్, రాఘవేందర్‌రెడ్డి, నాగిళ్ల మురళి, కళ్యాణ చక్రవర్తి, నర్సింగ్ కాలేజీ విద్యార్థినులు పాల్గొన్నారు.

రాజగోపాల్‌రెడ్డికి మంత్రి పదవి!

- ఉమ్మడి జిల్లాకు మూడో మంత్రి
- బాలునాయక్‌కు డిప్యూటీ స్పీకర్
- ఢిల్లీ చర్చల్లో దాదాపుగా ఖరారు



రాజగోపాల్‌రెడ్డి



బాలునాయక్

సాక్షి ప్రతినిధి, నల్లగొండ: మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డికి మంత్రి పదవికి లైన్ క్లియర్ అయినట్లు తెలిసింది. దీంతో జిల్లాకు మరో మంత్రి పదవి దక్కబోతోంది. మంత్రివర్గ విస్తరణపై సోమవారం ఢిల్లీలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, భారీ నీటి పారుదల శాఖ మంత్రి నలమాద ఉత్తమ్‌కుమార్‌రెడ్డి కాంగ్రెస్ అధిష్టానంతో చర్చించారు. ఇందులో రాజగోపాల్‌రెడ్డికి మంత్రి ఇచ్చేందుకు ఓకే చెప్పినట్లు సమాచారం. మరోవైపు దేవరకొండ ఎమ్మెల్యే బాలునాయక్‌కు డిప్యూటీ స్పీకర్ పదవితోపాటు పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ పదవి ఇచ్చే అవకాశం ఉన్నట్లు తెలిసింది. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి తనకు మంత్రి పదవి వస్తుందన్న ఆశతో రాజగోపాల్‌రెడ్డి ఉన్నారు. అయితే, వివిధ కారణాలతో అది వాయిదా పడుతూ వచ్చింది. దేవరకొండ ఎమ్మెల్యే బాలునాయక్‌కు కూడా మంత్రి పదవి వస్తుందన్న నమ్మకంతో ఆయన అనుచరులు ఉన్నారు. అయితే, రాజగోపాల్‌రెడ్డికి మంత్రి పదవి ఇవ్వబోతున్నందున బాలునాయక్‌కు డిప్యూటీ స్పీకర్ పదవి ఇస్తారన్న చర్చ సాగుతోంది. ప్రస్తుతం ఉమ్మడి జిల్లా నుంచి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, నలమాద ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి మంత్రి పదవులు ఉండగా, మూడో మంత్రి పదవి రాజగోపాల్‌రెడ్డికి దక్కనుంది. ఉగాదికి మంత్రివర్గ విస్తరణ ఉంటుందని, దీనిపై అధికారిక ప్రకటన వెలువడనుందని పార్టీ వర్గాలు చెబుతున్నాయి.

ప్రశ్నపత్రం లీకేజీలో ఎవరి పాత్ర ఎంత?

- విద్యా, పోలీసు, రెవెన్యూ శాఖల వైఫల్యమే కారణమా!
- ప్రశ్నపత్రం ఫొటో తీసుకునేందుకు సహకరించిందంటూ బాలిక డిబార్
- మరి.. బయటి వ్యక్తి పరీక్ష కేంద్రంలోని రావడానికి కారణమైన వారిపై చర్యలేవీ?
- అనుమానాలకు తావిస్తోన్న అధికారుల తీరు



సాక్షి ప్రతినిధి, నల్లగొండ : పదో తరగతి తెలుగు పేపరు–1 ప్రశ్నపత్రం లీకేజీ వ్యవహారానికి అసలు బాధ్యులు ఎవరు? ఎవరిని బలి చేశారన్న చర్చ ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఈనెల 21వ తేదీన ఉదయం లీకైన తెలుగు ప్రశ్నపత్రం శాలిగౌరారంలో యువకుల వాట్సాప్‌లలో సర్క్యులేట్ అయ్యేంత వరకు ప్రశ్నపత్రం బయటకు వచ్చిన విషయాన్ని అధికారులు గుర్తించకపోవడం అనుమానాలకు తావిస్తోంది. విద్యాశాఖ నిర్లక్ష్యం, అధికారుల పర్యవేక్షణ లోపం, భద్రతా వైఫల్యమే ప్రశ్నపత్రం లీకేజీకి కారణమనే చర్చ సాగుతోంది. పైగా ప్రశ్నపత్రం ఫొటో తీసుకునేందుకు సహకరించిందంటూ విద్యార్థిని ఝాన్సీలక్ష్మిని డిబార్ చేయడం అనేక విమర్శలకు కారణం అవుతోంది.

గోడ దూకి ఎలా వచ్చాడు?

సాధారణంగానే టెన్త్, ఇంటర్ పరీక్షల సమయంలో 144 సెక్షన్‌ను విధిస్తారు. పరీక్ష కేంద్రం పరిసరాల్లో ఇది అమల్లో ఉంటుంది. ఆ సమయంలో బయటి వ్యక్తి ఒకరు పాఠశాల ప్రహరిగోడ దూకి ఆవరణలోని వచ్చారంటే భద్రత వైఫల్యమే కారణమనే చర్చ సాగుతోంది. అంతేకాదు సదరు వ్యక్తి తరగతి గది వరకు వచ్చి మరీ కిటికీలోనుంచి విద్యార్థిని ప్రశ్నపత్రం ఫొటో తీసుకొని వెళ్లాడంటే లోపం ఎక్కడుందన్న విషయాన్ని విచారణలో పట్టించుకోవడం లేదనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అసలు స్థానిక పోలీసులు ఈ పరీక్షలకు సీరియస్‌గా తీసుకోలేదనే విమర్శలు ఉన్నాయి. కేవలం ఒకరిద్దరు కానిస్టేబుళ్లను మాత్రమే పరీక్ష కేంద్రం వద్ద బందోబస్తుకు ఉంచినట్లుగా తెలుస్తోంది. భద్రత కల్పించడంలో స్థానిక పోలీసులు విఫలం అయ్యారని, ఆ విషయాన్ని పక్కన పెట్టి విచారణ చేస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి. పరీక్ష కేంద్రం వద్ద పోలీసు భద్రత పటిష్టంగా ఉంటే ఈ పరిస్థితి ఎందుకు వచ్చిందన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

జిరాక్స్ కేంద్రాలు ఎలా తెరిచారు?

పరీక్ష కేంద్రంలో ప్రశ్నపత్రాన్ని సెల్‌ఫోన్‌తో ఫొటో తీయగా, అందులోని ప్రశ్నలకు అనుగుణంగా ఒకే పేపరులో వచ్చేలా జవాబులను సిద్ధం చేసి స్థానికంగా జిరాక్స్ తీశారు. పరీక్షలు సమయంలో అంతటా జిరాక్స్ సెంటర్లను మూసేస్తారు. కానీ నకిరేకల్, శాలిగౌరారంలో జిరాక్స్ కేంద్రాలు ఎలా తెరిచి ఉంచారు? దానికి బాధ్యులు ఎవరన్నది ఇప్పుడు జిల్లాలో చర్చనీయాంశంగా మారింది.

బాధితురాలా? నిందితురాలా?

ఇన్ని లోపాలకు కారణమైన వారిపై చర్యలు చేపట్టకుండా ప్రశ్నపత్రం ఫొటో తీసుకునేందుకు సహకరించిందంటూ బాలిక ఝాన్సీలక్ష్మిని డిబార్ చేయడం అనేక విమర్శలకు తావిస్తోంది. ప్రతిభావంతులైన పిల్లలు కూడా పదో తరగతి పరీక్షలు అంటేనే భయపడతారు. పరీక్ష కేంద్రంలోకి వచ్చాక ఎలా రాయాలన్న ఆందోళనలోనే ఉంటారు. అలాంటి సమయంలో ఒక వ్యక్తి వచ్చి రాయితో కొడతానని బెదిరించి ప్రశ్నపత్రం ఫొటో తీసుకుంటే అందుకు బాలిక సహకరించినట్టా? విద్యార్థిని నుంచి ఫొటో తీసుకొని వెళ్లి, జవాబులను మళ్లీ ఆమెకు తెచ్చి ఇచ్చారా? ఈ విషయం విద్యాశాఖ అధికారులే చెప్పాలి. ఆ బాలిక బాధితురాలా? నిందితురాలా? అన్నది తేల్చాల్సి ఉంది. ఇవేమీ చెప్పకుండా, అసలు భద్రతా లోపం, పర్యవేక్షణ వైఫల్యాలకు కారణమైన వారిపై చర్యలు చేపట్టకుండా, ఆ బాలికను డిబార్ చేయడంపై విద్యార్థిని కుటుంబ సభ్యులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అంతేకాదు అధికారులు వ్యవహరించిన తీరుపై తీవ్ర విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. పైగా ఈ సంఘటన జరిగిన నాలుగు రోజులకు (సోమవారం) మండల విద్యాధికారి ఈ సంఘటనపై ప్రకటన జారీ చేయడం ఆశ్చర్యాన్ని కలిగిస్తోంది.

నన్ను అన్యాయంగా డిబార్ చేశారు

- పరీక్ష రాసే అవకాశం ఇవ్వండి
- విద్యార్థిని ఝాన్సీలక్ష్మి



విద్యార్థిని ఝాన్సీలక్ష్మి

నకిరేకల్ : 'పరీక్ష ప్రశ్నపత్రం లీకేజీలో నాకు ఏ పాపం తెలియదు.. నన్ను డిబార్ చేశారు. నాకు పరీక్ష రాసే అవకాశం కల్పించాలి. లేకుంటే నాకు చావే శరణ్యం' అని పదో తరగతి విద్యార్థిని బల్లెం ఝాన్సీలక్ష్మి తన ఆవేదన వెలిబుచ్చింది. నకిరేకల్‌లో ఈ నెల 21 పదో తరగతి తెలుగు పేపర్ లీకై.. ప్రశ్నపత్రం వాట్సప్‌లలో చక్కర్లు కొట్టిన విషయం తెలిసిందే. ఈ ఘటనలో ప్రమేయం ఉందంటూ.. అధికారులు విద్యార్థిని ఝాన్సీలక్ష్మిని డిబార్ చేశారు. ఇప్పుడు ఆ విద్యార్థినిని మిగతా పరీక్షలకు అనుమతించడం లేదు. దీంతో ఆమె సోమవారం తన తల్లిదండ్రుల వెంకన్న, శోభతో కలిసి విలేకరుల ముందు తన గోడును వెల్లబోసుకుంది. తాను నకిరేకల్‌లోని శ్రీకృష్ణవేణి పాఠశాలలో నర్సరీ నుంచి పదో తరగతి వరకు చదువుకున్నానని, తాను క్లాస్‌లో టాపర్‌నని చెప్పింది. తీరా పది పరీక్షలు రాస్తున్న తరుణంలో ఎవరో ఆకతాయిలు తాను పరీక్ష రాస్తున్న గది వద్దకు తనను బెదిరించి ప్రశ్నపత్రం ఫొటోలు తీసుకున్నారని చెప్పింది. పేపర్ చూపించకుంటే రాయితో కొడతామని బెదిరించారని, ఆ సమయంలో భయపడి ప్రశ్నపత్రం చూపించానని, తన పక్కన ఉన్న విద్యార్థులు కూడా ఏం కాదులే చూపించు అన్నారని పేర్కొంది. పేపర్ ఫొటో తీసేందుకు సహకరించాననే ఆరోపణలతో తనను అధికారులు డిబార్ చేశారని చెప్పింది. 'నా డిబార్‌ను రద్దు చేయండి.. నన్ను ఏ సెంటర్‌లోనైనా కూర్చోబెట్టి పరీక్ష రాయించినా.. రాస్తాను. ఎవరో చేసిన దానికి నన్ను బలిచేశారు. దయచేసి నాకు పరీక్ష రాసేందుకు అవకాశం ఇవ్వండి' అని ఝాన్సీలక్ష్మి వేడుకుంది. పరీక్షలకు అనుమతివ్వకపోతే చావే శరణ్యమని కన్నీటిపర్యంతమైంది. జిల్లా విద్యాధికారులు, పోలీసులు మానవత్వంతో కనికరించి తనకు అవకాశం ఇవ్వాలని కోరింది.



ఎన్జీ కాలేజీ ఎదుట నల్ల బ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేస్తున్న ప్రొఫెసర్లు

యూజీసీ మార్గదర్శకాలను రద్దు చేయాలి

రామగిరి(నల్లగొండ) : యూజీసీ – 2025 మార్గదర్శకాలను వెంటనే రద్దు చేయాలని తెలంగాణ ప్రభుత్వ కళాశాల అధ్యాపకుల సంఘం జిల్లా అధ్యక్షుడు డాక్టర్ అనిల్ అబ్రహం డిమాండ్ చేశారు. ఎంఫిల్, పీహెచ్‌డీ ఇంక్రిమెంట్ల రద్దుకు వ్యతిరేకంగా సోమవారం ఎన్జీ కళాశాల ఎదుట అసిస్టెంట్ ప్రొఫెసర్లు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధ్యాపకులకు వ్యతిరేకంగా తీసుకున్న నిర్ణయాలను వెనక్కి తీసుకోకపోతే దేశ వ్యాప్తంగా ఆందోళన చేపడుతామని హెచ్చరించారు. దేశ వ్యాప్తంగా విశ్వవిద్యాలయాలు, డిగ్రీ కళాశాలల్లో ఖాళీగా ఉన్న అధ్యాపక పోస్టులను వెంటనే భర్తీ చేయాలన్నారు. అసోసియేట్ ప్రొఫెసర్ ప్రమోషన్‌కు పీహెచ్‌డీ తప్పనిసరి చేయడం సరికాదన్నారు. నూతన విద్యా విధానం –2020పై నిష్ణాతులైన ప్రొఫెసర్లను చర్చకు ఆహ్వానించి విధి విధానాలను ఖరారు చేయాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ సముద్రాల ఉపేందర్, డాక్టర్ అనిల్ బొజ్జ, వైస్ ప్రిన్సిపాళ్లు డాక్టర్ పరంగి రవికుమార్, డాక్టర్ అంతటి శ్రీనివాస్, సీఓఈ బత్తిని నాగరాజు, ఐక్యూఏసి కోఆర్డినేటర్ డాక్టర్ ప్రసన్న కుమార్, అధ్యాపకులు ముని స్వామి, కిరీటం, శ్రీధర్, సుధాకర్, మల్లేశం, జ్యోత్స్న, భాగ్యలక్ష్మి, శంకర్ తదితరులున్నారు.

యాదగిరిగుట్టలో సంప్రదాయ పూజలు

యాదగిరిగుట్ట రూరల్: యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి క్షేత్రానికి అనుబంధంగా ఉన్న శ్రీ పర్వతవర్ధిని సమేత రామలింగేశ్వరస్వామి ఆలయంలో సోమవారం ఆలయ అర్చకులు సంప్రదాయ పూజలు చేపట్టారు. శివుడికి ఇష్టమైన రోజు కావడంతో రుద్రాభిషేకం, బిల్వార్చన పూజలు గావించారు. ముఖ మండపంలో స్పటిక లింగానికి అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రధానాలయంలోనూ సంప్రదాయ పూజలు శాస్త్రోక్తంగా కొనసాగించారు. వేకువజామునే ఆలయాన్ని తెరిచిన అర్చకులు, సుప్రభాత సేవతో స్వామి వారిని మేల్కొలిపారు. అనంతరం గర్భాలయంలోని స్వయంభూవులకు, ప్రతిష్ట అలంకారమూర్తులకు నిజాభిషేకం, తులసీదళాలలను అర్చించారు.

రైతులకు అండగా ఉంటాం



ఆర్జాలబావి వద్ద మాట్లాడుతున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, చిత్రంలో కలెక్టర్ ఇలా త్రిపాఠి

- ధాన్యం కొనుగోళ్లలో జిల్లా మొదటి స్థానంలో నిలవాలి
- మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి
- ఆర్జాలబావి, తిప్పర్తిలో ధాన్యం కొనుగోలు కేంద్రాల ప్రారంభం



తిప్పర్తి : ధాన్యంలో తేమశాతాన్ని పరిశీలిస్తున్న మంత్రి కోమటిరెడ్డి, కలెక్టర్ ఇలా త్రిపాఠి

రామగిరి(నల్లగొండ), తిప్పర్తి : ప్రభుత్వం రైతులకు అండగా ఉంటుందని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. సోమవారం ఆయన నల్లగొండ జిల్లా కేంద్రం సమీపంలోని ఆర్జాలబావి వద్ద, తిప్పర్తి మార్కెట్‌యార్డులో యాసంగి ధాన్యం కొనుగోలు కేంద్రాలను కలెక్టర్ ఇలా త్రిపాఠితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయాచోట్ల మంత్రి మాట్లాడుతూ ధాన్యం కొనుగోళ్లలో జిల్లాను రాష్ట్రంలోనే మొదటి స్థానంలో ఉంచాలన్నారు. ప్రభుత్వం సన్న ధాన్యం కొనుగోలుకు ప్రత్యేక కేంద్రాలు ఏర్పాటు చేస్తుందని.. సన్న ధాన్యానికి క్వింటాకు రూ.500 బోనస్ ఇస్తుందని తెలిపారు. ఈ సీజన్‌లో జిల్లాలో 375 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామని.. అవసరమైతే కేంద్రాల సంఖ్య పెంచుతామన్నారు. కొనుగోలు కేంద్రాల్లో అవసరమైన అన్ని వసతులు కల్పించాలని అధికారులకు సూచించారు. మిల్లర్లు కొర్రీలు పెట్టి రైతులను ఇబ్బంది పెడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఉగాది పండుగ రోజున హుజూర్‌నగర్‌లో రేషన్ కార్డుదారులకు సన్నబియ్యాన్ని ఇచ్చే కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రారంభిస్తారని తెలిపారు. బ్రాహ్మణ వెల్లెంల ద్వారా కట్టంగూరు, నార్కెట్‌పల్లి, మునుగోడు మండలాల్లోని లక్ష ఎకరాలకు నీరిస్తామన్నారు. ఎస్‌ఎల్‌బీసీ సొరంగం పనులను పూర్తి చేస్తే నల్లగొండ సస్యశ్యామలం అవుతుందన్నారు.

నాణ్యమైన ధాన్యం తేవాలి : కలెక్టర్

కలెక్టర్ ఇలా త్రిపాఠి మాట్లాడుతూ రైతులు నాణ్యత ప్రమాణాలతో కూడిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకొచ్చి మద్దతు ధర పొందాలన్నారు. ధాన్యం కొనుగోలుకు ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలను ఏర్పాటు చేశామన్నారు. రైతులు వరితో పాటు ప్రత్యామ్నాయంగా వాణిజ్య పంటలను సాగు చేయాలని సూచించారు. ప్రతి కేంద్రంలో ఆటోమెటిక్ ప్యాడీక్లీనర్ ఉన్నాయని వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ధాన్యం కొనుగోళ్లలో రైతులకు ఏదైనా సమస్య ఉంటే పౌరసరఫరాల శాఖ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విభాగంలో ఫిర్యాదు చేయాలన్నారు. కార్యక్రమాల్లో డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి, అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్, ఆర్డీఓ వై.అశోక్‌రెడ్డి, జిల్లా పౌర సరఫరాల మేనేజర్ హరీష్, డీఆర్‌డీఓ శేఖర్‌రెడ్డి, డీసీఓ పత్యానాయక్, మార్కెటింగ్ ఏడీ ఛాయాదేవి, మార్కెట్ చైర్మన్ జూపూడి రమేష్, డీసీసీబీ డైరెక్టర్ పాశం సంపత్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ నాగరత్నం రాజు, తిప్పర్తి తహసీల్దార్ పరుశరాములు, ఎంపీడీఓ వెంకటేశ్వర్‌రెడ్డి, ఏఓ సన్నిరాజు, నాయకులు బద్దం సుధీర్, పాదూరి శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

ఉన్నత విద్యలో నాణ్యతా ప్రమాణాలు పెంచాలి



అకడమిక్ కౌన్సిల్ సమావేశంలో మాట్లాడుతున్న ప్రొఫెసర్ అంజిరెడ్డి

రామగిరి(నల్లగొండ): ఉన్నత విద్యా రంగంలో నాణ్యతా ప్రమాణాలను పెంచాలని ఎంజీ యూనివర్సిటీ వీసీ ఓఎస్‌డీ ప్రొఫెసర్ జి.అంజిరెడ్డి అన్నారు. నల్లగొండ ఎన్జీ కళాశాలలో సోమవారం జరిగిన అకడమిక్ కౌన్సిల్ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థులు అతిగా సెల్‌ఫోన్లు వినియోగిస్తూ తమ భవిష్యత్‌ను నాశనం చేసుకుంటున్నారని పేర్కొన్నారు. తప్పులు లేకుండా, భావం చెడకుండా ఒక వాక్యం రాయలేని స్థితిలో నేటి విద్యార్థులు ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎంజీయూ కంప్యూటర్ సైన్స్ ప్రొఫెసర్ డాక్టర్ రేఖ మాట్లాడుతూ ఆడ్ ఆన్ కోర్సుల్లో భాగంగా కృత్రిమ మేధను చేర్చాలని సూచించారు. రిటైర్డ్ ప్రొఫెసర్ డాక్టర్ నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన బోధన అందించి భవిష్యత్తుకు పునాదులు వేయాలని సూచించారు. ఎన్జీ కాలేజీలో ప్రతిభ చూపిన విద్యార్థులకు తన గురువు డాక్టర్ వీరయ్య పేరున ఏటా గోల్డ్ మెడల్ ఇస్తారని ప్రకటించారు. అలాగే మరో రెండు బంగారు గోల్డ్ మెడల్స్ ఇచ్చేందుకు ముందుకొచ్చిన డాక్టర్ అంతటి శ్రీనివాస్, వెంకట్‌రెడ్డిని అభినందిచారు. ఈ సందర్భంగా ఇండస్ట్రియలిస్ట్ శ్రీధర్‌రెడ్డి ఎన్జీ కళాశాలకు కంప్యూటర్లు అందజేస్తానన్నారు. 2025–2026 విద్యా సంవత్సరంలో అమలయ్యే పలు కీలక నిర్ణయాలను తీసుకున్న ఈ సమావేశంలో అకడమిక్ కౌన్సిల్ చైర్మన్, ఎన్జీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సముద్రాల ఉపేందర్, అకడమిక్ కోఆర్డినేటర్ డాక్టర్ పరంగి రవికుమార్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ అంతటి శ్రీనివాస్, పరీక్షల నియంత్రణాధికారి బత్తిని నాగరాజు, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ ప్రసన్నకుమార్, అధ్యాపకులు మునిస్వామి, భట్టు కిరీటం, వెల్దండి శ్రీధర్, అనిల్ బొజ్జ, జ్యోత్స్న, శివరాణి, సావిత్రి పాల్గొన్నారు.

ప్రజావాణి ఫిర్యాదులను పరిష్కరించాలి

- కలెక్టర్ ఇలా త్రిపాఠి



ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

నల్లగొండ : ప్రజావాణి ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదేశించారు. ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా సోమవారం ఆమె కలెక్టరేట్ సమావేశ మందిరంలో ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించి మాట్లాడారు. ప్రజావాణి దరఖాస్తులను జాప్యం చేయకుండా పరిష్కరించాలన్నారు. సమస్య పరిష్కారం కాకపోతే.. ఎందుకు కాలేదో ఫిర్యాదుదారులకు స్పష్టంగా తెలియజేయాలన్నారు. అనంతరం కలెక్టర్ వివిధ అంశాలపై సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. 'దర్తీ ఆబ జన జాతీయ గ్రామ ఉత్కర్ష్ అభియాన్' పథకం కింద తిరుమలగిరి సాగర్ మండలం, రంగుండ్ల తండాలో అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు కార్యాచరణ రూపొందించాలని ఆదేశించారు. తండాలో జల్ జీవన్ కింద పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ శాఖ ద్వారా 10 మీటర్ల లోతున వాన నీటి కట్టడాలను చేపట్టాలని సూచించారు. గ్రామంలో అన్ని ప్రభుత్వ సంస్థల్లో సోలార్ లైట్లు, 10 హెచ్‌పీ సోలార్ పంప్, పబ్లిక్ టాప్‌ల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు. రంగుండ్లలో చేపట్టే పనులు ఇతర తండాలకు మోడల్‌గా నిలవాలని సూచించారు. 52 గిరిజన తండాల్లో ఈ పథకాన్ని అమలు చేసేందుకు అవకాశం ఉందని తెలిపారు. సమావేశంలో అదనపు కలెక్టర్ శ్రీనివాస్, ఇన్‌చార్జి డీఆర్‌ఓ వై.అశోక్‌రెడ్డి, స్పెషల్ కలెక్టర్ నటరాజ్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

నిందితులకు శిక్ష పడితేనే ప్రజలకు నమ్మకం

- ఎస్పీ శరత్‌చంద్ర పవార్



మాట్లాడుతున్న ఎస్పీ శరత్‌చంద్ర పవార్

నల్లగొండ : ప్రతి కేసులోనూ నిందితులకు శిక్ష పడితేనే.. ప్రజలకు పోలీస్‌శాఖపై నమ్మకం పెరుగుతుందని ఎస్పీ శరత్‌చంద్ర పవార్ అన్నారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, కోర్టు డ్యూటీ ఆఫీసర్లకు ఏర్పాటు చేసిన అభినందన సమావేశంలో ఆయన మాట్లాడారు. కోర్టు కేసుల్లో శిక్షల శాతాన్ని పెంచడం, తప్పు చేసిన నిందితులకు శిక్ష పడే విధంగా చేసినప్పుడే నేరాలు తగ్గుముఖం పడతాయన్నారు. కోర్టు అధికారులు, ప్రాసిక్యూటర్ల సమన్వయంతో న్యాయ సలహాలు తీసుకుని పనిచేయాలన్నారు. కేసు తుదిదశలో సాక్షులు, నిందితులు, బాధితులను సమయానికి కోర్టులో హాజరుపరిచేలా చూసుకోవాలన్నారు. సంవత్సరకాలంలో జిల్లా వ్యాప్తంగా వివిధ కేసుల్లో ఒకరికి ఉరిశిక్ష, 17 మందికి జీవిత ఖైదు విధించడం అభినందనీయమన్నారు. నిందితులకు శిక్ష పడేలా కృషి చేసిన ప్రాసిక్యూటర్లను, కోర్టు డ్యూటీ అధికారులను ఎస్పీ అభినందించి ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో డీఎస్పీలు శివరాంరెడ్డి, డీఎస్పీ రాజశేఖరరాజు, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు శ్రీవాణి, అఖిల, వెంకటేశ్వర్లు, జవహర్‌లాల్, రంజిత్‌కుమార్, డీసీఆర్‌బీ సీఐ శ్రీను నాయక్, కోర్టు డ్యూటీ అధికారులు పాల్గొన్నారు.

పోలీస్ గ్రీవెన్స్‌లో ఫిర్యాదులు స్వీకరణ

జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం పోలీస్ గ్రీవెన్స్‌డేలో ఎస్పీ శరత్‌చంద్ర పవార్ బాధితుల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన అర్జిదారులతో ఎస్పీ మాట్లాడి వారి సమస్యను తెలుసుకొని సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి పూర్తి వివరాలు సమర్పించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రజలకు పోలీస్‌శాఖను మరింత చేరువ చేయాలని, స్టేషన్‌కి వచ్చిన ఫిర్యాదుదారులతో మర్యాదగా మాట్లాడి చట్టపరంగా వారికి న్యాయం జరిగే విధంగా చూడాలని సూచించారు.

క్లుప్తంగా

టాటా ఏస్‌ను ఢీకొట్టిన కారు.. ఒకరికి గాయాలు


ఘటనా స్థలంలో కారు, టాటా ఏస్

కొండమల్లేపల్లి: టాటా ఏస్ వాహనాన్ని కారు ఢీకొనడంతో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన కొండమల్లేపల్లి మండలం జోగ్యతండా వద్ద సోమవారం జరిగింది. పెద్దఅడిశర్లపల్లి నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న కారు కొండమల్లేపల్లి మండలం జోగ్యతండా సమీపంలో మూలమలుపు వద్ద అదుపుతప్పి హైదరాబాద్ నుంచి కొండమల్లేపల్లి వైపు కుక్కర్లు, మిక్సీలు తదితర సామగ్రితో వస్తున్న టాటా ఏస్ వాహనాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో టాటా ఏస్ డ్రైవర్ మల్లేష్ కాలు విరగడంతో చికిత్స నిమిత్తం అతడిని స్థానికులు దేవరకొండ ఏరియా ఆస్పత్రికి తరలించారు. కాగా ఈ ఘటనకు సంబంధించి తమకెలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్ఐ రామ్మూర్తి తెలిపారు.

హత్య కేసులో నిందితుడికి పదేళ్లు జైలుశిక్ష

భువనగిరి: భార్యాభర్తను హత్య కేసిన కేసులో నిందితుడికి పదేళ్ల జైలుశిక్ష, రూ.20వలే జరిమానా విధిస్తూ భువనగిరి జిల్లా సెషన్స్ కోర్టు జడ్జి జయరాజు సోమవారం తీర్పు వెలువరించారు. భువనగిరి రూరల్ ఎస్‌హెచ్‌ఓ సంతోష్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. భువనగిరి మండలం తుక్కాపురం గ్రామానికి చెందిన రాసాల బస్వయ్య గొర్రెలు మేపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. 2023 అక్టోబర్ 13వ తేదీన బస్వయ్య తన ఇంటి వద్ద ఉన్న గొర్రెల దొడ్డి నుంచి గొర్రెలను మేపేందుకు తోలుకెళ్తున్నాడు. ఈ క్రమంలో బస్వయ్య ఇంటి పక్కనే ఉంటున్న రాసాల రాజమల్లు తన ఇంటి ముందు నుంచి గొర్రెలను తోలుకపోవడం వల్ల దుమ్ము లేచి ఇబ్బందులు పడుతున్నామని బస్వయ్యతో వాగ్వాదానికి దిగాడు. ఈ క్రమంలో వారిద్దరి మధ్య మాటామాట పెరిగి రాజమల్లు అక్కడే ఉన్న పారతో బస్వయ్య తలపై కొట్టాడు. అదే సమయంలో అడ్డుగా వచ్చిన బస్వయ్య భార్య తిరుపతమ్మ తలపై కూడా కొట్టాడు. దీంతో బస్వయ్య అక్కడికక్కడే మృతిచెందగా.. తిరుపతమ్మ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందింది. మృతుడి అల్లుడు గంగసమోని శ్రీను ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. అప్పటి సీఐ సత్యనారాయణ నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ కేసును విచారణలో భాగంగా జడ్జి సాక్ష్యాధారాలు పరిశీలించి రాజమల్లుకు పదేళ్ల జైలు, రూ.20వేలు జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించారు.

చక్రయ్యను అల్లుళ్లే అంతమొందించారు

- మామ ఆధిపత్యం భరించలేక హత్యకు పథకం రచించిన మూడో అల్లుడు
- సహకరించిన ముగ్గురు కుమార్తెలు, మరో ఇద్దరు అల్లుళ్లు
- 13మంది నిందితుల అరెస్ట్
- వివరాలు వెల్లడించిన సూర్యాపేట జిల్లా ఎస్పీ నరసింహ


నిందితుల వివరాలు వెల్లడిస్తున్న సూర్యాపేట ఎస్పీ నరసింహ

సూర్యాపేటటౌన్: గ్రామంలో ఆధిపత్యం కోసం మామను అతికిరాతకంగా హత్య చేయించాడు సొంత అల్లుడు. నూతనకల్ మండలం మిర్యాల గ్రామంలో హత్యకు గురైన మాజీ సర్పంచ్ మెంచు చక్రయ్యగౌడ్ హత్య కేసులో 13 మంది నిందితులను పోలీసులు సోమవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను సోమవారం సూర్యాపేట జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ నరసింహ విలేకరులకు వెల్ల డించారు.

చక్రయ్యగౌడ్ ఆధిపత్యం సహించలేక..

మెంచు చక్రయ్యగౌడ్ గ్రామంలో పెద్దమనిషిగా చలామణి అవుతూ గ్రామ సర్పంచ్‌గా కూడా పనిచేశాడు. అతడికి ఐదుగురు కుమార్తెలు సంతానం. తన మూడో కుమార్తె కనకటి సునీతను కూడా సర్పంచ్‌గా, మూడో అల్లుడు కనకటి వెంకన్నను పీఏసీఎస్ చైర్మన్‌గా చేశాడు. అల్లుడు కనకటి వెంకన్న పీఏసీఎస్ చైర్మన్ అయిన్నప్పటి నుంచి నూతనకల్ మండలంలో తన ఆధిపత్యాన్ని కొనసాగిస్తున్నాడు. గ్రామంలో చక్రయ్యగౌడ్ ఆధిపత్యం ఉండటం వెంకన్న వర్గీయులు సహించలేకపోయారు. చక్రయ్యగౌడ్‌కు వ్యతిరేకంగా వెంకన్న వర్గీయులు ఒక గ్రూపుగా ఏర్పడడంతో వారి మధ్య మనస్పర్ధలు వచ్చాయి. అసెంబ్లీ ఎన్నికల అనంతరం 2023లో చక్రయ్యగౌడ్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. 2024లో కనకటి వెంకన్న కూడా కాంగ్రెస్‌లోకి వచ్చాడు. అయినప్పటికీ గ్రామంలో చక్రయ్యగౌడ్ ఆధిపత్యం కొనసాగుతోంది. దీంతో ఎలాగైనా మామ చక్రయ్యగౌడ్‌ను అడ్డు తొలగించుకోవాలని కనకటి వెంకన్న నిర్ణయించుకున్నాడు.

బొడ్రాయి మహోత్సవంలో హత్యకు పథకం..

ఈ నెల 13న మిర్యాల గ్రామంలో బొడ్రాయి మహోత్సవం జరిగింది. గతంలో కనకటి వెంకన్న ఆధ్వర్యంలో ఈ ఉత్సవాలు జరిగేవి, చక్రయ్యగౌడ్ ఈసారి ఉత్సవాలను తన ఆధ్వర్యంలో జరపాలని బహిరంగంగా ప్రకటించడంతో వెంకన్న తట్టుకోలేకపోయాడు. దీంతో ఎలాగైనా చక్రయ్యగౌడ్‌ను హత్య చేయాలని తన వర్గీయులను కొంతమందిని వెంకన్న పురమాయించాడు. ఈ నెల 17వ తేదీ సాయంత్రం చక్రయ్యగౌడ్ తన వ్యవసాయ బావి వద్దకు వెళ్లి వస్తుండగా.. అతడి మొదటి అల్లుడు కనకటి ఉప్పలయ్య, ఐదో అల్లుడు కనకటి లింగయ్యతో పాటు వెంకన్న అనుచరులైన కనకటి శ్రవణ్, కనకటి శ్రీకాంత్, గంధసిరి వెంకటేష్, పెద్దింటి మధు, పెద్దింటి గణేష్ అడ్డగించి మారణాయుధాలు, వెదురు కర్రలతో చక్రయ్యగౌడ్‌పై దాడి చేసి హత్య చేశారు. ఇదంతా దూరంగా నుంచి గమనిస్తున్న వెంకన్న చక్రయ్యగౌడ్‌పై దాడి జరిగగానే అతడు చనిపోయాడని నిర్ధారించుకుని అక్కడి నుంచి అందరూ పారిపోయారు. ఈ హత్యపై నూతనకల్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. సోమవారం ఉదయం తుంగతుర్తి పరిధిలో వాహనాల తనిఖీల్లో భాగంగా.. చక్రయ్యగౌడ్ హత్యలో ప్రత్యక్షంగా పాల్గొన్న అతడి మొదటి అల్లుడు కనకటి ఉప్పలయ్యతో పాటు హత్యకు కుట్ర పన్నిన మూడో అల్లుడు కనకటి వెంకన్న, వెంకన్న భార్య సునీత, మొదటి కుమార్తె కనకటి స్వరూప, ఐదో కుమార్తె కనకటి కల్యాణితో పాటు దిండిగల నగేశ్, జక్కి పరమేష్, మన్నెం రమేశ్, కనకటి వెంకన్న అలియాస్ మొండి వెంకన్న, కనకటి శ్రావ్య, కనకటి/వర్దెల్లి అనూష, జక్కి స్వప్న, భారీ సతీష్ రెండు కార్లలో వెళ్తుండగా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారిని విచారించగా.. చక్రయ్యగౌడ్‌ను హత్య చేసినట్లు నిజం ఒప్పుకున్నారు. నిందితుల నుంచి రెండు కార్లు, ఒక కర్ర, 10 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు ఎస్పీ తెలిపారు. ఈ కేసులో మొత్తం 42 మందిపై కేసు నమోదైందని, దర్యాప్తు కొనసాగుతుందని ఎస్పీ తెలిపారు. ప్రత్యక్షంగా హత్యలో పాల్గొన్న ఏడుగురు నిందితుల్లో కనకటి ఉప్పలయ్య మినహా మిగతా ఆరుగురు గతంలోనే కోర్టులో లొంగిపోయినట్లు సమాచారం.

కస్టడీ పిటీషన్ వేసి దర్యాప్తు చేస్తాం

ఈ హత్య కేసులో ప్రత్యక్షంగా, పరోక్షంగా పాల్గొన్న ఎవరినీ వదిలిపెట్టకుండా కచ్చితమైన ఆధారాలు సేకరిస్తూ దర్యాప్తు పారదర్శకంగా చేస్తున్నట్లు ఎస్పీ తెలిపారు. కస్టడీ పిటిషన్ వేసి నిందితులను కస్టడీలోకి తీసుకుని దర్యాప్తు చేస్తామన్నారు. నిందితులను పట్టుకున్న పోలీసులకు ఎస్పీ రివార్డు అందజేశారు. ఈ కేసు ఛేదించిన సూర్యాపేట డీఎస్పీ రవి, సీఐ డి. శ్రీను, ఎస్ఐలు మహేంద్రనాథ్, ఎం. వీరయ్య, ఆర్. క్రాంతికుమార్‌ను ఎస్పీ అభినందించారు.

లక్ష్యం సాధించే వరకు విశ్రమించొద్దు

- పోటీ పరీక్షలకు ఓపికతో సన్నద్ధమవ్వాలి
- గ్రూప్-2 స్టేట్ టాపర్ హరవర్ధన్‌రెడ్డి


హరవర్ధన్‌రెడ్డి

కోదాడ: లక్ష్యాన్ని నిర్దేశించుకొని.. దానిని సాధించే వరకు విశ్రమించొద్దని గ్రూప్-2 స్టేట్ టాపర్ నారు హరవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. గ్రూప్-2లో తొలి ప్రయత్నంలోనే రాష్ట్రస్థాయిలో ప్రథమ స్థానం సాధించిన కోదాడకు చెందిన హరవర్ధన్ రెడ్డి విజయ ప్రస్థానం ఆయన మాటల్లోనే..

అక్కడ పుట్టి.. ఇక్కడ పెరిగా

మా స్వస్థలం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ప్రకాశం జిల్లా కంభం. మా నాన్న నారు రవణారెడ్డి ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకుడిగా ఖమ్మం జిల్లాలో విధులు నిర్వహించేవారు. ప్రాథమిక విద్య ఖమ్మంలో, ఇంటర్మీడియట్ విజయవాడలో చదివాను. తాడేపల్లిగూడెం ఎన్ఐటీలో ఇంజనీరింగ్(సీఎస్‌సీ) పూర్తిచేశాను. ప్రస్తుతం మా నాన్న కోదాడ కేఆర్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్నారు.

మా నాన్నే నాకు స్ఫూర్తి..

మధ్యతరగతి కుటుంబంలో పుట్టిన మా నాన్న కష్టపడి చదువుకొని ప్రభుత్వ ఉద్యోగం సాధించారు. ఆయనను స్ఫూర్తిగా తీసుకొని ప్రభుత్వ ఉద్యోగంలో చేరాలని నిర్ణయించుకున్నాను. ఎన్ఐటీలో క్యాంపస్ ప్లేస్‌మెంట్‌కు కూడా ప్రయత్నించలేదు.

తొలి ప్రయత్నంలోనే విజయం

2021 నుంచి గ్రూప్స్ ప్రిపరేషన్ మొదలుపెట్టాను. ముందు సివిల్స్ కోసం ఆన్‌లైన్ కోచింగ్ తీసుకున్నాను. ఆ సమయంలోనే గ్రూప్-1, గ్రూప్ - 2 నోటిఫికేషన్లు రావడంతో సివిల్స్ వదిలేసి గ్రూప్స్‌కు ప్రిపరేషన్ మొదలు పెట్టాను. మొదట ఈ రెండింటికి ప్రిపరేషన్ మొదలుపెట్టినప్పటికీ ఆ తర్వాత కేవలం గ్రూప్-2 పైనే పూర్తిగా దృష్టి సారించాను. రోజుకు 10 గంటలు చదివి తొలి ప్రయత్నంలోనే టాపర్‌గా నిలిచాను.

సొంతంగా నోట్స్ తయారు చేసుకున్నా..

పోటీ పరీక్షలకు సిద్ధమవ్వడం ఒక యుద్ధంలాంటిది. యుద్ధంలో ఆయుధాలు ఎంత ముఖ్యమో పోటీ పరీక్షలకు ప్రమాణిక పుస్తకాలు అంత ముఖ్యం. దీంతో పాటు సొంతంగా నోట్స్ తయారు చేసుకోవడం కూడా చాలా అవసరం. ఇండియన్ హిస్టరీ కోసం నిధి సింఘానియా పుస్తకం, తెలంగాణ ఉద్యమానికి సంబంధించి వి. ప్రకాశ్ పుస్తకం, సైన్స్ అండ్ టెక్నాలజీ కోసం ఎన్‌సీఈఆర్‌టీ పుస్తకాలను చదివాను. కరెంట్ అఫైర్స్ కోసం కాంపిటీటివ్ వెబ్‌సైట్స్‌తో పాటు దినపత్రికలను చదివాను.

ఓపిక ఉంటేనే విజయం సొంతం

పోటీ పరీక్షలకు సిద్ధమయ్యేవారికి ఓపిక ఉండాలి. పరీక్షలు సుదీర్ఘకాలం సాగవచ్చు లేదా వాయిదా పడవచ్చు. ఇలాంటి సమయంలో సమన్వయం కోల్పోవద్దు. ఆశాజనకంగా ప్రయత్నించాలి. ఒకేసారి ఎక్కువ పరీక్షలకు సిద్ధమవ్వకుండా ఒకే పరీక్షపై దృష్టి పెట్టాలి. దానిని సాధించిన తర్వాత ఇతర పరీక్షల వైపు వెళ్లవచ్చు.

గ్రూప్-1, సివిల్స్‌కు సన్నద్ధమవుతా..

ప్రస్తుత మార్కులతో డిప్యూటీ తహసీల్దార్ లేదా రాష్ట్ర సచివాలయంలో ఏఎస్ఓ ఉద్యోగాన్ని ఎంచుకుంటాను. దీనిలో శక్తి వంచన లేకుండా సేవలందిస్తాను. భవిష్యత్తులో గ్రూప్-1, సివిల్స్ కోసం ప్రిపరేషన్ కొనసాగిస్తాను.

లారీ ఢీకొని రైతు దుర్మరణం

మిర్యాలగూడ టౌన్: రోడ్డు దాటుతుండగా లారీ ఢీకొని రైతు మృతిచెందాడు. ఈ ఘటన ఆదివారం రాత్రి మిర్యాలగూడ మండలం గూడూరు గ్రామ సమీపంలో అద్దంకి-నార్కట్‌పల్లి రహదారిపై జరిగింది. సోమవారం మిర్యాలగూడ రూరల్ ఎస్ఐ మల్లికంటి లక్ష్మయ్య తెలిపిన వివరాల ప్రకారం.. మిర్యాలగూడ మండలం కొత్తపేట గ్రామానికి చెందిన దాసరి జానకిరాములు(50), అదే గ్రామానికి చెందిన ట్రాక్టర్ డ్రైవర్ బచ్చు శ్రీనుతో కలిసి ఆదివారం రాత్రి ట్రాక్టర్‌లో ధాన్యం లోడుతో మిర్యాగూడ మండలం గూడూరు గ్రామ సమీపంలో అద్దంకి-నార్కట్‌పల్లి రహదారి వెంట గల కీర్తి రైస్ మిల్లుకు వచ్చారు. మిల్లు వద్ద సీరియల్ క్రమంలో వీరి ట్రాక్టర్‌ను పెట్టారు. అనంతరం భోజనం చేసేందుకు రోడ్డుపైకి వచ్చారు. భోజనం చేసిన తర్వాత తిరిగి ట్రాక్టర్ వద్దకు నడుచుకుంటూ వెళ్తూ అద్దం-నార్కట్‌పల్లి రహదారిపై మోటార్ వెహికిల్ కార్యాలయం సమీపంలో రోడ్డు దాటుతుండగా హైదరాబాద్ నుంచి గుంటూరు వైపు వెళ్తున్న లారీ అతివేగంగా వచ్చి జానకిరాములు, శ్రీనును వెనుక నుంచి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు 108 వాహనంలో వారిని మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం స్థానికంగా ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ జానకిరాములు అర్ధరాత్రి మృతిచెందాడు. విజయవాడకు చెందిన లారీ డ్రైవర్ మొగులూరు రవిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మృతుడి కుమారుడు దాసరి నాగసైదులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

తెలంగాణ కళాకారులతో దొడ్డి కొమురయ్య సినిమా


కళాకారులతో మాట్లాడుతున్న దర్శకుడు

హుజూర్‌నగర్: తెలంగాణలోని అన్ని జిల్లాల కళాకారులతో దొడ్డి కొమురయ్య జీవిత చరిత్రపై సినిమా నిర్మిస్తున్నట్లు సినీ దర్శకుడు సేనాపతి అన్నారు. సోమవారం హుజూర్‌నగర్ వచ్చిన ఆయన స్థానిక కళాకారులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. గొప్ప చరిత్ర కలిగిన దొడ్డి కొమరయ్య జీవితాన్ని తెలంగాణ ప్రజలకు, ముఖ్యంగా నేటి తరం యువతకు తెలియజేయాలనే ఉద్దేశంతో ఈ సినిమా నిర్మాణానికి ముందుకు వచ్చినట్లు తెలిపారు. తెలంగాణ కళాకారులకు ఈ సినిమాలో అవకాశం ఇస్తున్నట్లు పేర్కొన్నారు. ఇప్పటికే ఈ సినిమా షూటింగ్ ప్రారంభమైందన్నారు. కార్యక్రమంలో కళాకారులు ఎస్. శ్రీనివాస్, జి. దీప, కె. బాబు, డి. శ్రీనివాస్, నరసింహచారి, బి. గోవిందరావు, కె. రవి, పి. వెంకటేశ్వర్లు, ఎం. సైదులు, డి. బాబురావు తదితరులు పాల్గొన్నారు.

కూలీల మృతికి కారణమైన నిందితులకు జైలు శిక్ష

వలిగొండ: నిర్లక్ష్యంగా ట్రాక్టర్ నడిపి 15మంది కూలీల మృతికి కారణమైన ఇద్దరి నిందితులకు జైలు శిక్ష, జరిమానా విధిస్తూ సోమవారం నల్లగొండ ఎస్సీ, ఎస్టీ సెషన్స్ కోర్టు న్యాయమూర్తి రోజారమణి తీర్పు వెలువరించారు. వలిగొండ ఎస్ఐ యుగేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. వలిగొండ మండలం వేములకొండకు చెందిన వ్యవసాయ కూలీలను 2018 జూన్ 24న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం గుంటూరు జిల్లా సత్తెనపల్లి మండలం లక్ష్మీపురం గ్రామానికి చెందిన ఆలూరు వెంకటనారాయణ, అదే జిల్లా పెద్దనందిపాడు మండలం రావిపాలెం గ్రామానికి చెందిన ధూళిపాళ్ల నాగేశ్వర్‌రావు ట్రాక్టర్‌లో ఎక్కించుకుని మూసీ కాల్వ కట్ట మీదుగా పత్తి ఏరేందుకు తీసుకెళ్తున్నారు. ఈ క్రమంలో ట్రాక్టర్ నడుపుతున్న వెంకటనారాయణ నిర్లక్ష్యం కారణంగా ట్రాక్టర్ మూసీ కాల్వలోకి పల్టీ కొట్టింది. ఈ ప్రమాదంలో ట్రాక్టర్‌లో ప్రయాణిస్తున్న 15 మంది అక్కడికక్కడే మృతిచెందగా.. మరో 17 మందికి గాయాలయ్యాయి. అప్పటి వలిగొండ ఎస్ఐ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. వెంకటనారాయణ, నాగేశ్వర్‌రావును అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. డ్రైవర్ నిర్లక్ష్యం, డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా ట్రాక్టర్ నడిపి 15 మంది కూలీల మృతికి కారణమైనట్లు రుజువు కావడంతో సోమవారం నల్లగొండ ఎస్సీ, ఎస్టీ కోర్టు న్యాయమూర్తి రోజారమణి వెంకటనారాయణకు పదేళ్ల జైలు శిక్ష, రూ.5వేల జరిమానా, నాగేశ్వర్‌రావుకు రూ.5వేలు జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించారు. ఈ కేసులో అదనపు పీపీ అఖిల వాదనలు వినిపించారు.

చోరీ జరిగిన ఇంట్లో పోలీసుల తనిఖీలు

- దొంగిలించబడిన సొత్తు కంటే ఎక్కువ బంగారం, వెండి, నగదు లభ్యం

కొండమల్లేపల్లి: చోరీ జరిగిన ఇంటిని పరిశీలించడానికి వెళ్లిన పోలీసులకు ఆ ఇంట్లో చోరీ జరిగిన దానికంటే ఎక్కువ బంగారం, వెండి, నగదు లభ్యమవ్వడంతో ఆశ్చర్యపోయారు. పోలీసులు, బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. కొండమల్లేపల్లి మండల కేంద్రంలోని వాసవీబజార్‌లో నివాసముంటున్న గుర్రం లక్ష్మీకాంతమ్మ భర్త వాసుదేవ్ రెండేళ్ల క్రితం మృతిచెందాడు. దీంతో ఆమె వినాయక్‌నగర్‌లో ఉంటున్న తన ఇద్దరు కుమారులతో కలిసి ఉంటుంది. అయితే వాసవీబజార్‌లోని ఇంటికి అడపాదడపా వచ్చి వెళ్తుండేవారు. సోమవారం ఉదయం వాసవీబజార్‌లోని ఇంటికి వెళ్లిన లక్ష్మీకాంతమ్మ చిన్న కుమారుడు మహేశ్వర్ ఇంటి తాళాలు పగలగొట్టి ఉండడం, ఇంట్లోని సామగ్రి చిందరవందరగా ఉండడాన్ని గుర్తించి చోరీ జరిగినట్లు నిర్ధారించుకొని 100కు కాల్ చేసి పోలీసులకు సమాచారం అందించాడు. దీంతో దేవరకొండ ఏఎస్పీ మౌనిక, ఎస్ఐ రామ్మూర్తి చోరీ జరిగిన ఇంటిని పరిశీలించారు. క్లూస్‌టీం వివరాలు సేకరిస్తుండగా ఆ ఇంట్లో 34.5 తులాల బంగారం, కేజిన్నర వెండి, రూ.8.7లక్షల నగదు లభ్యం కావడంతో పోలీసులు సైతం ఆశ్చర్యపోయారు. 100కు కాల్ చేసిన సమయంలో సుమారు 30తులాల బంగారం, రూ.5లక్షల నగదు చోరీకి గురైనట్లు సమాచారం ఇచ్చారని, కానీ ఇంట్లో అదనంగా మరింత బంగారం, వెండి, నగదు లభ్యం కావడంతో పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఇదిలా ఉంటే 10తులాల బంగారం, రూ.5లక్షల నగదు చోరీకి గురైనట్లు బాధితులు పోలీసులకు తెలుపడంతో చోరీ జరిగిన సొత్తు విషయంలో ఒకింత గందరగోళం నెలకొంది. బాధితురాలు లక్ష్మీకాంతమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రామ్మూర్తి తెలిపారు.

భార్య మందలించిందని మనస్తాపంతో..

- అర్ధరాత్రి ఇంట్లో నుంచి వెళ్లిన భర్త



రమణ

మిర్యాలగూడ టౌన్: మద్యం తాగి ఇంటికి వచ్చిన భర్తను భార్య మందలించడంతో మనస్తాపానికి గురైన భర్త అర్ధరాత్రి ఇంట్లో నుంచి వెళ్లిపోయాడు. ఈ ఘటన మిర్యాలగూడ మండలం అవంతీపురంలో సోమవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మిర్యాలగూడ రూరల్ ఎస్ఐ మల్లికంటి లక్ష్మ య్య తెలిపిన వివరాల ప్రకారం.. మిర్యాలగూడ మండలం అవంతీపురం గ్రామానికి చెందిన పర్వతం రమణ నిత్యం మద్యం తాగి ఇంటికి వెళ్తున్నాడు. ఈ నెల 18వ తేదీ రాత్రి కూడా మద్యం తాగి ఇంటికి వెళ్లడంతో.. మద్యం ఎందుకు తాగి వచ్చావు అంటూ భార్య యశోద నిలదీసింది. దీంతో మనస్తాపానికి గురైన రమణ అర్ధరాత్రి ఇంట్లో అందరూ నిద్రిస్తున్న సమయంలో బయటకు వెళ్లి తిరిగిరాలేదు. రమణ కోసం ఎంత వెతికినా ఆచూకీ లభించకపోవడంతో అతడి భార్య యశోద ఈ నెల 21వ తేదీన మిర్యాలగూడ రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

పెద్దఅడిశర్లపల్లి: భూతగాదాల నేపథ్యంలో పురుగుల మందు తాగిన వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందాడు. గుడిపల్లి ఎస్ఐ నర్సింహులు తెలిపిన వివరాల ప్రకారం.. పెద్దఅడిశర్లపల్లి మండలం మల్లాపురం గ్రామానికి చెందిన నేతాల సత్తయ్య(48) ఈ నెల 11వ తేదీన భూతగాదాల నేపథ్యంలో పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు అతడిని సికింద్రాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతి చెందాడు. మృతుడి భార్య సాలమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్య


నాగిరెడ్డి (ఫైల్)

గుర్రంపోడు: ఆర్థిక ఇబ్బందులతో గడ్డిమందు తాగిన వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందాడు. ఈ ఘటన గుర్రంపోడు మండలం వద్దిరెడ్డిగూడెంలో జరిగింది. ఎస్ఐ పసుపులేటి మధు తెలిపిన వివరాల ప్రకారం.. వద్దిరెడ్డిగూడేనికి చెందిన మేకల నాగిరెడ్డి(39) తనకున్న 9ఎకరాల భూమిలో బత్తాయి తోటతో పాటు వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఆర్థిక ఇబ్బందులతో నాగిరెడ్డి ఆదివారం పొలం వద్ద గడ్డిమందు తాగాడు. కుటుంబ సభ్యులు గమనించి నల్లగొండలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. పరిస్థితి విషమంగా ఉండడంతో హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ సోమవారం తెల్లవారుజామునే మృతిచెందాడు. మృతుడి భార్య మేకల సునీత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

గంజాయి తరలిస్తున్న ఇద్దరు వ్యక్తుల అరెస్ట్


వివరాలు వెల్లడిస్తున్న సీఐ వీరరాఘవులు

సూర్యాపేటటౌన్: గంజాయి తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను సోమవారం పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ కేసు వివరాలను సూర్యాపేట టౌన్ సీఐ వీరరాఘవులు విలేకరులకు వెల్లడించారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం.. సోమవారం ఉదయం సూర్యాపేట టౌన్ ఎస్ఐ సైదులు, పోలీస్ సిబ్బంది కలిసి సూర్యాపేట పట్టణంలోని ఖమ్మం క్రాస్ రోడ్డులో వాహనాలు తనిఖీ చేస్తున్నారు. అదే సమయంలో సూర్యాపేట పట్టణానికి చెందిన దాసరి సిద్ధార్థ, మహ్మద్ ఉమర్ బైక్‌పై ఒక కిలో 200 గ్రాముల గంజాయితో కోదాడ నుంచి సూర్యాపేటకు వస్తూ పోలీసులను చూసి పారిపోయేందుకు ప్రయత్నించగా.. పోలీసులు వారిని పట్టుకున్నారు. వారి వద్ద నుంచి గంజాయి, బైక్ స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు.

పార్ట్‌టైం జాబ్ పేరుతో మోసం

- డబ్బులు కాజేసిన సైబర్ నేరగాళ్లు

భువనగిరి: పార్ట్‌టైం జాబ్ పేరుతో ఓ వ్యక్తి వద్ద సైబర్ నేరగాళ్లు డబ్బులు కాజేశారు. భువనగిరి రూరల్ ఎస్‌హెచ్‌ఓ సంతోష్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఎన్టీఆర్ కృష్ణా జిల్లా గూడూరు మండలానికి చెందిన గోసాల శ్యామల్‌రావు ఏడాది క్రితం బతుకుదెరువు కోసం భువనగిరి మండలం రాయగిరి గ్రామానికి వలస వచ్చాడు. ప్రస్తుతం సూపర్‌వైజర్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈ నెల 15న పార్ట్‌టైం జాబ్ కోసం గూగుల్‌లో సెర్చ్ చేస్తూ ఒక లింక్ ఓపెన్ చేశాడు. అందులో తన వివరాలను నమోదు చేశాడు. తర్వాత తన ఫోన్‌లోని వాట్సాప్‌కు వచ్చిన వీడియోను చూసి లైక్ చేసి షేర్ చేశాడు. అనంతరం ఇంట్లోనే ఉండి డబ్బులు సంపాదించవచ్చని చెప్పి కొన్ని టాస్క్‌లు ఇచ్చారు. టాస్క్‌లో భాగంగా వారు పంపిన వెబ్‌సైట్‌లో డబ్బులు డిపాజిట్ చేస్తే 30శాతం లాభం వస్తుందని చెప్పారు. దీంతో శ్యామల్‌రావు మొదట రూ.1000 డిపాజిట్ చేయగా.. రూ.1500 రిటర్న్స్ వచ్చాయి. ఈవిధంగా ఈ నెల 18వ తేదీ నాటికి రూ.1,92,000 డిపాజిట్ చేశాడు. తర్వాత డబ్బులు రాకపోవడంతో తాను మోసపోయినట్లు గ్రహించి 1930 కాల్ చేసి ఫిర్యాదు చేశాడు. దీంతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌ఓ తెలిపారు.

కిరాణా షాపు యజమానికి టోకరా

- సరుకుల కొనేందుకు వచ్చి ఫోన్ పే ద్వారా రూ.90వేలు ట్రాన్స్‌ఫర్ చేసుకున్న గుర్తుతెలియని వ్యక్తి


బాధితుడు రాధాకిషన్

నకిరేకల్: సరుకులు కొనేందుకు కిరాణ దుకాణం వద్దకు వచ్చిన గుర్తుతెలియని వ్యక్తి షాపు యాజమాని ఫోన్ తీసుకుని ఫోన్ పే ద్వారా రూ.90వేలు ట్రాన్స్‌ఫర్ చేసుకుని పరారయ్యాడు. ఈ ఘటన నకిరేకల్ పట్టణంలో ఆదివారం రాత్రి జరిగింది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. నకిరేకల్ పట్టణంలోని మూసీ రోడ్డులో మంచుకొండ రాధాకిషన్ నిర్వహిస్తున్న కిరాణ షాప్‌కు ఆదివారం సాయంత్రం గుర్తుతెలియని వ్యక్తి వచ్చారు. తనకు కావల్సిన సరుకుల లిస్ట్‌ను షాపు యాజమాని మంచుకొండ రాధాకిషన్‌కు ఇచ్చాడు. షాపు యాజమాని సరుకులు కట్టే పనిలో నిమగ్నం కాగా.. ఇంటికి ఫోన్ చేసి ఇంకా ఏమైనా సరుకులు కావాలా అని అడుగుతానని సదరు వ్యక్తి రాధాకిషన్ ఫోన్ అడిగాడు. దీంతో రాధాకిషన్ తన ఫోన్‌ను సదరు వ్యక్తికి ఇచ్చాడు. ఫోన్ తీసుకున్న గుర్తుతెలియని వ్యక్తి మూడు సార్లు రూ.90వేలు ఫోన్ పే ద్వారా వేరే నంబర్‌కి డబ్బులు పంపే ప్రయత్నం చేశాడు. పాస్‌వర్డ్ తెలియకపోవడంతో మూడు సార్లు ట్రాన్సాక్షన్ ఫెయిల్ అని పడింది. నాల్గోసారి సరైన పాస్‌వర్డ్ నమోదు చేయడంతో రూ.90 వేలు రేష్మాదేవి పేరుతో ఉన్న అకౌంట్‌కు ట్రాన్స్‌ఫర్ అయ్యాయి. అనంతరం సదరు వ్యక్తి ఫోన్‌ను షాపు యాజమాని రాధాకిషన్‌కు ఇచ్చి.. నేను చికెన్ తెచ్చుకుని వస్తా సరుకులు కట్టి బిల్ చేసి పెట్టండని అక్కడ నుంచి ఉడాయించాడు. సదరు వ్యక్తి అరగంట అయినా రాకపోవడంతో రాధాకిషన్ తన భార్య లక్ష్మికి విషయం చెప్పాడు. అనుమానం వచ్చి రాధాకిషన్ ఫోన్‌ను అతడి భార్య చెక్ చేయగా.. రూ.90 వేలు ట్రాన్స్‌ఫర్ అయినట్లు మెసేజ్ కనిపించింది. దీంతో ఆదివారం రాత్రి రాధాకిషన్ స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసును సైబర్ క్రైంకు బదిలీ చేశారు. ప్రస్తుతం సైబర్ క్రైం వారు కేసు విచారణ చేస్తున్నారు.

బావిలో పడి యువకుడు మృతి

మోతె: బావిలో పడి యువకుడు మృతిచెందాడు. ఈ ఘటన మోతె మండలం గోల్‌తండా- బుర్కచర్ల గ్రామాల మధ్య సోమవారం జరిగింది. మృతుడి కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గోల్‌తండాకు చెందిన ధరావత్ సైదులు(26)కు చివ్వెంల మండలం గోల్‌తండాకు చెందిన ఇంద్రజతో ఏడేళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. తొమ్మిది నెలల క్రితం ఇంద్రజ తన పిల్లలను తీసుకొని తల్లిగారింటికి వెళ్లింది. మద్యానికి బానిసైన సైదులు శనివారం రాత్రి భార్య వద్దకు వెళ్తానని చెప్పి తన తల్లి వద్ద డబ్బులు తీసుకొని బయల్దేరాడు. ఆదివారం గోల్‌తండా-బుర్కచర్ల గ్రామాల మధ్యలో వ్యవసాయబావిలో సైదులు మృతదేహం కనిపించడంతో స్థానికులు గమనించి అతడి తండ్రి ధరావత్ మంగ్యాకు సమాచారం ఇచ్చారు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు మోతె ఎస్ఐ యాదవేందర్ తెలిపారు.

● బోండాన్ని సులువుగా కట్ చేయవచ్చు!




సాధారణంగా కొబ్బరిబోండాను కొట్టాలంటే పదునైన కత్తితో కొడతారు. ఇది కాస్త రిస్క్‌తో కూడుకున్న పని. కానీ నడిగూడెంలో కొబ్బరిబోండాల దుకాణం నిర్వహిస్తున్న కన్నెబోయిన మురళి ఇటీవల యూట్యూబ్‌లో కొబ్బరిబోండాలను సులువుగా కొట్టే పరికరాన్ని చూసి రూ.5వేలతో విజయవాడ నుంచి దానిని తీసుకొచ్చాడు. ఆ పరికరంతో తక్కువ శ్రమతో కొబ్బరిబోండాను కట్ చేసి, దానికి ప్రత్యేకంగా ఉన్న ముల్లుతో బోండాకు రంధ్రం పెట్టి వినియోగదారులకు అందిస్తున్నాడు. – నడిగూడెం